

నేడు ప్రపంచ మలేరియా దినోత్సవం

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 25న ప్రపంచ మలేరియా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు సబ్ యూనిట్ అధికారి జె మోహనరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలో మలేరియా బారినపడి మరణాలు ఎక్కువ మరణాలు సంభవించడంతో ఉన్న రోజుల్లో డబ్ల్యుహెచ్ఒ (ప్రపంచ ఆరోగ్య సంస్థ) 2007లో జరిగిన ఆరోగ్య సదస్సులో ప్రతి ఏటా ఏప్రిల్ 25న ప్రపంచ మలేరియా దినోత్సవంగా చేయాలని ధ్రువీకరించారని వివరించారు. ఈ నేపథ్యంలో ఐటిడిఎ పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, అసిస్టెంట్ మలేరియా అధికారి ఆధ్వర్యంలో సీతంపేటలో మలేరియా నివారణ గురించి ప్రతిజ్ఞ, ర్యాలీ నిర్వహించనున్నట్టు తెలిపారు.

జిఒ 3 రద్దు ఫలితం

ఎస్‌టిలకు అత్తెసరు పోస్టులు

- నష్టపోతున్న గిరిజన ఉపాధ్యాయ అభ్యర్థులు
- డిఎస్‌సితో ఒరిగింది శూన్యమేంటున్న గిరిజనులు
- రోడ్డున పడనున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఉపాధ్యాయ డిఎస్సీతో ఏజెన్సీలోని గిరిజన నిరుద్యోగ యువతకు పెద్దగా ఒరిగిందేమీ లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో ఉండే జీవో 3ను రద్దు చేయడంతో గిరిజన ఉపాధ్యాయ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఈ జీవో 3 రద్దు కావడంతో అప్పుడు గిరిజన సంఘాలు పెద్ద ఎత్తున పోరాటాలు చేశాయి. అయినప్పటికీ దాన్ని పునరుద్ధరించే ప్రయత్నం అప్పుడు వైసిపి ప్రభుత్వం చేయలేదు, ఇప్పుడు న్న టిడిపి ప్రభుత్వం కూడా అదే బాటలో నడుస్తోంది. గత ఎన్నికల ముందు కూటమి పార్టీలు జీవో 3ను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చాయి. అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్న దాఖలాల్లేవు. మరోవైపు గిరిజనులకు ప్రత్యేక డిఎస్సీ నిర్వహించాలని కూడా గిరిజన సంఘాలు కోరుతున్నాయి. మన్యం జిల్లాలో వేలాదిమంది గిరిజన అభ్యర్థులు ఉపాధ్యాయ డిఎస్సీ కోసం ఎదురు చూస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో శిక్షణలు తీసుకుంటున్నారు.

ఎస్‌టి అభ్యర్థులకు అన్యాయం

ఉపాధ్యాయ డిఎస్సీలో ఎస్టీలకు కేటాయించిన పోస్టులు చాలా తక్కువగా ఉన్నాయి. దీని వల్ల వారు తీవ్రంగా నష్టపోతారు. జీవో 3 రద్దు కావడం వల్లనే ఈ పరిస్థితి ఏర్పడింది.

ఎస్.మురళీమోహన్ రావు,
యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి.

ఐటిడిఎల్లో అత్తెసరు పోస్టులు

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 16వేల ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ ప్రకటన విడుదలైంది. జీవో 3 రద్దు కావడంతో గిరిజన ఉపాధ్యాయ అభ్యర్థులు ఎంతగా నష్టపోతున్నారనేది నోటిఫికేషన్‌లో ఎస్టీలకు కేటాయించిన పోస్టుల సంఖ్య చూస్తుంటే అర్థమవుతుంది. గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసమే ఏర్పడిన ఐటిడిఎ ప్రాజెక్టుల పరిధిలో ఉన్న మొత్తం పోస్టుల్లో ఎస్టీలకు కేవలం అత్తెసరు పోస్టులు మాత్రమే కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో 137 పోస్టులకు గానూ ఎస్టీలకు పది పోస్టులు మాత్రమే కేటాయించారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో 85 పోస్టులకు 6 పోస్టులు, పాడేరు ఐటిడిఎ పరిధిలో 400 పోస్టులకు 25 పోస్టులు మాత్రమే కేటాయింపు జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది గిరిజన అభ్యర్థులు ఉపాధ్యాయ డిఎస్సీ కోసం శిక్షణ పొందుతున్నారు. కేటాయించిన పోస్టుల్లో కనీసం వందల్లో కూడా కనిపించడం లేదు. దీంతో గిరిజన యువకులు ఉపాధ్యాయ పోస్టులపై ఆశలు వదులుకునే పరిస్థితి కనిపిస్తోంది.

జీవో 3 అమల్లో ఉంటే

ఏజెన్సీ ప్రాంతంలో జీవో 3 అమల్లో ఉంటే మొత్తం ఉద్యోగాలు ఎస్టీలకు కేటాయించాల్సిన అవసరం ఉంది. ఈ జీవో రద్దు కానంతర వరకు ఆ పరిస్థితి ఉండేది. ఈ జీవో రద్దు చేసిన తర్వాత విడుదలైన మొదటి డిఎస్సీతో గిరిజన



ఉపాధ్యాయ అభ్యర్థులు తీవ్రంగా నష్టపోనున్నారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. గిరిజన సంఘాలు జీవో 3 పునరుద్ధరణకు ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే స్థితిలో ప్రస్తుత ప్రభుత్వం లేదు. ఈ జీవోకు ప్రత్యామ్నాయ జీవో తీసుకొస్తామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ఇటీవల పాడేరు ఐటిడిఎ పాలకవర్గ సమావేశంలో చెప్పారు. కానీ అది ఎప్పుడు తీసుకొస్తారనే స్పష్టత ఆమె ఇవ్వలేదు. ఈ జీవో పునరుద్ధరణ చేసే అవకాశం కనుచూపు మేరలో కనిపించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

రోడ్డున పడనున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డిఎస్‌సిలో గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉపాధ్యాయ పోస్టులను మినహాయించకపోవడంతో వారి భవిష్యత్తు అంధకారంలో పడనుంది. ఇప్పుడు జరగనున్న డిఎస్సీలో పోటీని తట్టుకుని వారు నిలబడే అవకాశం లేదు. అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉపాధ్యాయుల్లో 80 శాతం మంది ఎస్టీలే ఉన్నారు. గత 15 ఏళ్లుగా వారు గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల్లో పని చేస్తున్నారు. తమ పోస్టులను డిఎస్సీ నుంచి మినహాయించాలని అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు సుమారు నెల రోజుల పాటు సమ్మె చేసినా ప్రభుత్వం దిగి రాలేదు.

గిరిజనులకు తీరని అన్యాయం

డిఎస్సీలో గిరిజనులకు కేటాయించిన పోస్టుల సంఖ్య గణనీయంగా తగ్గింది. జీవో 3 రద్దు ఫలితం గానే ఈ పరిస్థితి ఏర్పడింది. అనేక ఏళ్లుగా డిఎస్సీ కోసం ఎదురు చూస్తున్న గిరిజన ఉపాధ్యాయ అభ్యర్థులకు తీవ్ర నిరాశకు గురి చేసింది. జీవో 3కు ప్రత్యామ్నాయ జీవో తీసుకొస్తామని మభ్యపెట్టడం తగదు.

పి.రంజిత్ కుమార్,
గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి



పార్వతీపురంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - పార్వతీపురం

జమ్మూ-కాశ్మీర్‌లో పహల్గామ్‌లో ఉగ్రవాదులు జరిపిన కాల్పులను నిరసిస్తూ, ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి, స్థానిక నాలుగు రోడ్ల జంక్షన్‌లో గాంధీ విగ్రహం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన వారికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బివి రమణ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉగ్రవాద నిర్మూలనకు చర్యలు చేపట్టడంలో విఫలమైందని విమర్శించారు, దేశ భద్రతకు అత్యంత ముఖ్యమైన సైనిక నియామకాల్లో చిత్తశుద్ధి లోపించి శాశ్వత ఉద్యోగాలు స్థానంలో అగ్నిపథ్ పద్ధతిలో ఉద్యోగాలను నియమించడంతో సైన్యంలో నిబద్ధత కొరవడుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.. సైన్యంలో 1,80,000 ఉద్యోగాలు ఖాళీలు ఉన్నాయని వాటి భర్తీకి చర్యలు చేపట్టకుండా తాత్సారం చేయడం కూడా ఉగ్రవాదం దేశంలో పెరిగిపోవడానికి కారణమని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి విదేశాంగ విధానం కూడా దేశ భద్రతకు పెనుముప్పుగా మారిందని పొరుగున ఉన్న దేశాలతో సత్సంబంధాలు లేకపోవడం కూడా దేశ భద్రతకు తీవ్ర నష్టమని విమర్శించారు. ఇప్పటికైనా ఉగ్రవాద నిర్మూలనకు. దేశ భద్రతకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి గొర్లి వెంకటరమణ, నాయకులు పాకల సన్యాసిరావు, బంకురు సూరిబాబు, సంచాన ఉమామహేశ్వరావు, పి రాజశేఖర్, ఆర్ శ్రీదేవి, జి.కృష్ణ, మల్లేష్, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

కొమరాడ : జమ్మూ - కాశ్మీర్‌లో పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన మారణహోమాన్ని ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగిస్తూ నిరసన ర్యాలీ గురువారం జరిగింది. ఈ ర్యాలీని ఉద్దేశించి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, వైసిపి అధికార ప్రతినిధి మరడాన సింహాచలం నాయుడు మాట్లాడుతూ ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థులు రాజేష్, అప్పలనాయుడు, తదితరు పాల్గొన్నారు.

28 నుంచి ఇసుక సరఫరా కావాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని భామిని మండలం నేరడి, పాలకొండ మండలం చినమంగళాపురం ఇసుక రీచుల వద్ద సోమవారం నుంచి ఇసుక సరఫరా కావాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఆ దిశగా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇసుక సరఫరాకు సంబంధించి కలెక్టర్ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ఉత్తర్వులు, మార్గదర్శకాలకు అనుగుణంగా ఇసుక సరఫరా జరగాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇసుకను తరలించేందుకు వీలుగా స్టాక్ పాయింట్లను సిద్ధం చేసుకోవాలని, ఇందుకు స్థల సేకరణ చేయాలని ఆదేశించారు. ముందుగా కాలుష్య నియంత్రణ మండలి, నీటి పారుదల శాఖాధికారులు రీచులను తనిఖీ చేసి నివేదికలు అందించాలని అన్నారు. అలాగే ఇసుక అక్రమంగా తరలించకుండా ఉండేందుకు పటిష్ట నిఘాను ఏర్పాటు చేయాలని అన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, గట్టి పోలీసు బందోబస్తు, బారికేడ్లు, చెక్‌పోస్టు, ఆన్ లైన్ వే బిల్లు, రిజిష్టర్లు, రికార్డులు అన్నీ పక్కాగా ఉండాలని అన్నారు. శనివారం నాటికి మొత్తం ప్రక్రియ పూర్తిచేసి సోమవారం నుంచి ఇసుక సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్. శోభిక, పాలకొండ సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, జిల్లా గనులు, భూగర్భవనరుల శాఖాధికారి, పోలీస్, నీటి వనరులు, గ్రామీణ నీటి సరఫరా విభాగం, కాలుష్య నియంత్రణ మండలి కార్యనిర్వాహక ఇంజినీర్లు, భామిని, పాలకొండ తహశీల్దారులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం : పీడీ

ప్రజాశక్తి - సీతంపేట

సీతంపేట ఏజెన్సీలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.ధర్మాచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని వాబ, పెదరామ, మొగదర గూడలో ఉన్న పిఎం జన్మన్ లబ్ధిదారులకు గృహ మంజూరు పత్రాలను స్వయంగా అందించారు. పిఎంఎవై గ్రామీణ పీఎం జన్మన్ స్కీంలో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు నిర్మాణాలు వేగవంతం చేయాలని లబ్ధిదారులకు సూచించారు. అలాగే రూఫ్ కాస్ట్ స్టేజిలో ఉన్న అందరూ ఇల్లు పూర్తి చేయాలని కోరారు. బిల్లులు వెంటనే చెల్లిస్తామని చెప్పారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆ సమస్య వెంటనే పరిష్కారానికి చొరవ చూపుతామని అన్నారు. గృహాలు శరవేగంగా పూర్తి చేయడానికి అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పిఎం జన్మన్ స్కీంపై గిరిజనుల అధికారులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయనతో పాటు తహశీల్దార్ పి.అప్పలరాజు, ఎంపిడిఒ టి.కృష్ణారావు, గృహ నిర్మాణ శాఖ ఎఇ సిహెచ్ వెంకటేష్, వర్క్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

నష్టం చేసే చట్టాలన్నీ నిలిపివేయాలి : సిఐటియు

20న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - సాలూరురూరల్

దేశంలో కార్మిక వర్గానికి నష్టం చేసేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న అన్ని రకాల చట్టాలను నిలిపివేయాలని, లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఐక్య ఉద్యమాల ద్వారా కేంద్ర ప్రభుత్వంతో తలపడేందుకు కార్మిక వర్గం సిద్ధమవుతుందని సిఐటియు హెచ్చరించారు. సాలూరులో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు గంట కృష్ణ అధ్యక్షతన మే 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతానికి జరిగిన విస్తృతస్థాయి సమావేశంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై మన్మథరావు మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పారిశ్రామిక అధిపతులు, దోపిడీ వర్గాలకు కొమ్ము కాయడం కోసం కార్మికుల శ్రమను దోచి పెట్టాలని చూస్తుందని విమర్శించారు. ఇందుకోసం పని గంటలు పెంచడం, సంఘాల ప్రాధాన్యతను తగ్గించి యాజమాన్యాలకు హక్కులు సులభతరం చేయడం అంటే కార్మికులను మోసగించడమేనని అన్నారు. ఇలాంటి నిర్ణయాలకు వ్యతిరేకంగా సిఐటియు ఇతర సంఘాలను కలుపుకొని పోరాటాలకు సిద్ధపడుతుందని తెలిపారు. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకటై శ్రమజీవులకు మేలు చేసే నిర్ణయాలు కన్నా కీడు చేసే నిర్ణయాలు ఎక్కువగా చేస్తున్నాయని విమర్శించారు. ప్రతినెలా జీతాలు కూడా చెల్లించని పరిస్థితి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో పనిచేస్తున్న స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు ఉద్యోగులు చిరు ఉద్యోగులు ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిన్నింటికీ నిరసనగా మే 20న తలపెట్టిన సమ్మెలో కార్మిక వర్గమంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్‌వై నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు కార్మిక వర్గానికి అనేక హామీలు ఇచ్చిందని, నేడు వాటి గురించి చర్చించకుండా ముఖ్యమంత్రి సంపద సృష్టి పేరుతో కాలయాపన చేస్తున్నారని, పనిచేస్తున్న కార్మికులకు జీతాలు చెల్లిస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని హామీలు ఇచ్చి నేడు కూటమిలో పార్టీలైన తెలుగుదేశం, జనసేన వారి సమస్యలు మర్చిపోయి కేంద్ర ప్రభుత్వం పెట్టుబడుదారుల సేవలో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు చేయకుంటే పెద్ద ఎత్తున పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధపడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మక్కువ, సాలూరు పాచిపెంట మండలాల సిఐటియు నాయకులు ఎల్.దాలమ్మ, టి.పార్వతి, కళ్యాణి, కె.ఈశ్వరరావు, శశికళ, గౌరీశ్వరి, టి వెంకట్రావు, రాముడు, అంగన్వాడీ యూనియన్ నాయకులు పుష్ప, ఉత్తరమ్మ, ఇందిర, నారాయణమ్మ, మధ్యాహ్న భోజనం కార్మిక సంఘం నాయకులు చొక్కాపు సుశీల, ఆర్పీల సంఘం నాయకులు అన్నపూర్ణ, మహేశ్వరి, ప్రభావతి యుటిఎఫ్ నాయకులు కోట జానకీరావు, మున్సిపల్ యూనియన్ నాయకులు టి.శ్రీనివాస్, టి.శంకర్రావు, స్వప్న, దేవి తదితరులు పాల్గొన్నారు.

పాలకొండ: నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాల రమణారావు



కరపత్రాలను విడుదల చేస్తున్న సిఐటియు నాయకులు



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న మన్మథరావు

పిలుపునిచ్చారు. సిఐటియు ఆధ్వర్యంలో గురువారం నవోదయ నగర్‌లో జరిగిన నియోజకవర్గ సదస్సులో రమణారావు మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా హక్కులకై పోరాడే కార్మికులను నేరస్తులను చేసేలా కార్మిక చట్టాన్ని క్రిమిన లైస్ చేశారని, బిజెపి ప్రభుత్వం కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్‌ల రద్దుకై పోరాడుదామని, మే డే స్ఫూర్తితో మే 20 దేశవ్యాప్త సమ్మెలో పాల్గొందామని అని పిలుపునిచ్చారు. అనంతరం మే 20న దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎస్.లక్ష్మి, సిహెచ్ భాగ్యలక్ష్మి, బి.అమరవేణి, కాద రాము, ఎ.లక్ష్మణరావు, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ఎన్.హేమప్రభ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.గౌరీశ్వరి, మధ్యాహ్నం భోజనం నాయకులు ఎన్.రోజీబాయి, రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సిహెచ్ సంజీవి, భవనిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు ఎం వీరనాయుడు, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు దూసి దుర్గారావు, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులు, ప్రభుత్వ పాఠశాలల శానిటేషన్ వర్కర్లు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మెడికల్ హెల్త్ అండ్ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్, రైస్ మిల్ వర్కర్స్, ఆటో, ఫీల్డ్ అసిస్టెంట్ యూనియన్, విఆర్ఎలు తదితర సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

పథకాల అమల్లో పారదర్శకత పాటించాలి

స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి - పాచిపెంట

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమల్లో అధికార యంత్రాంగం పారదర్శకతతో పాటు వేగాన్ని పాటించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ, శిశు సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మండలంలో అమలవుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని సమీక్షించేందుకు మండల స్థాయి అధికారులతో గురువారం స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, కావున అధికారులు ప్రతిష్టాత్మక పథకాల అమలులో పారదర్శకత, వేగం పాటించాలని సూచించారు. ముఖ్యంగా పల్లె ప్రగతి, హరిత హారం, సముదాయ శుభ్రత, నీటి సరఫరా, పింఛన్ల పంపిణీ, గృహ నిర్మాణాలు, విద్యుత్ సరఫరా, పాఠశాలల ఆధునీకరణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అదేవిధంగా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అవసరాలను అధికారులు సమర్థవంతంగా పరిష్కరించేలా వ్యవస్థను రూపొందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ప్రజాప్రతినిధుల సూచనల మేరకు అభివృద్ధి కార్యక్రమాలు అమల్లోకి రావాలని పేర్కొన్నారు. అభివృద్ధి పనుల నాణ్యతపై మంత్రి అధికారులను ప్రశ్నించడంతో పాటు పర్యవేక్షణ పెంచాలని, వాస్తవ నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. అనంతరం మండలంలో చేపట్టిన ప్రాధాన్యతా ప్రాజెక్టులపై సమయపాలనతో కూడిన కార్యాచరణ రూపొందించాలని పేర్కొన్నారు. ప్రతి గ్రామం అభివృద్ధి పరంగా ముందుకు సాగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. సమావేశంలో ఎంపిడిఒ బివిజె పాత్రో, తహశీల్దార్ డి .రవి పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి సమిష్టి కార్యచరణ

మండలంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి సమిష్టి కార్యచరణ ద్వారా ప్రతి కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని మంత్రి సంధ్యారాణి కోరారు. మండలంలోని మిర్తివలస సమీపాన టిడిపి మండల స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించడంతో పాటు ప్రజల సమస్యలపై స్పందనతో ముందుకు సాగాలని మంత్రి తెలిపారు. అలాగే మైదాన, ఏజెన్సీ ప్రాంతాల్లో గల ప్రతి ఊరికి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సంధ్యారాణి

తాగునీరు, రోడ్డు సదుపాయం కచ్చితంగా మన ప్రభుత్వం కల్పిస్తుందని హామీ ఇచ్చారు. స్థానిక ఎన్నికల్లో వందకి వందశాతం సీట్లు గెలవాలని నాయకులకు, కార్యకర్తలకు మంత్రి పిలుపునిచ్చారు. అలాగే గ్రామస్థాయిలో ఉండే ప్రజా ప్రతినిధులు, నాయకులు ప్రజల అవసరాలను గుర్తించి వారికి ప్రభుత్వం ద్వారా సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. టిడిపిని రాష్ట్రంలో బలమైన రాజకీయ శక్తిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతతో పనిచేసే ప్రజల సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరించి చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. రెడ్ బుక్ అనగానే వైసీపీ నాయకులకు హార్ట్ ఎటాక్ లు వస్తున్నాయని, కొంతమంది నాయకులు గ్రామాలు, రాష్ట్రాలు విడిచిపెట్టి వెళ్లిపోతున్నారని, ఎందుకంటే తప్పులు చేసిన వారికి శిక్షలు తప్పవని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని గుర్తు చేశారు. నియోజవర్గంలో సమస్యలన్నీ పరిష్కరిస్తానన్నారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, సర్పంచి గూడెపు యుగంధర్, నాయకులు పిన్నింటి ఈశ్వరరావు, కొత్తల పోలినాయుడు, మతల బలరాం, పల్లెడ ఉమామహేశ్వరరావు, పూసర్ల నర్సింగరావు, చల్లా కనక, కె.సురేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎసిబి అధికారులకు పట్టుబడిన ఎఇ జోగినాయుడు

ఎసిబికి చిక్కిన విద్యుత్‌శాఖ ఎఇ

ప్రజాశక్తి -మక్కువ

ఎసిబి వలలో విద్యుత్‌శాఖ ఎఇ జి.జోగి నాయుడు చిక్కారు. ఎసిబి డిఎస్పి బివిఎస్ ఎస్ రమణమూర్తి తెలిపిన వివరాల ప్రకారం విజయనగరానికి చెందిన రైతు బి.నరసింహారాజు (74) మక్కువ మండలంలో నగుళ్ళకు సమీపాన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోగా, రూ.17వేలు లంచం అడిగారు. దీంతో రైతు ఎసిబి విజయనగరం కార్యాలయంకు ఈనెల 22న ఫిర్యాదు చేశాడు. ఎసిబి వారు కేసు నమోదు చేసుకుని గురువారం రాత్రి స్థానిక విద్యుత్ కార్యాలయంలోనే రూ.17వేలు లంచం తీసుకుంటూ పట్టుకున్నట్లు డిఎస్‌పి తెలిపారు. నిందితుడ్ని శుక్రవారం విశాఖ ఎసిబి కోర్టులో హాజరు పరచనున్నట్లు డిఎస్పీ తెలిపారు. ఈ దాడిలో శ్రీకాకుళం విజయనగరం ఎసిబి సిఐలు మహేష్, భాస్కరరావు ఎస్సై వాసు నారాయణ,సిబ్బంది పాల్గొన్నారు.

బాల బాలికలకు నైతిక విలువలు నేర్పాలి

ప్రాంతీయ సదస్సులో ఆర్‌జెడి చిన్మయిదేవి

ప్రజాశక్తి-విజయనగరం

కౌమారదశలో బాల బాలికలకు తల్లిదండ్రులు నైతిక విలువలు నేర్పాలని మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు జి.చిన్మయిదేవి అన్నారు. సిడిపిఒలు, డిసిపిఒలకు జోనల్‌స్థాయి వర్క్‌షాప్ గురువారం స్థానిక కెమిస్ట్ కన్వెన్షన్ సెంటర్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌జెడి చిన్మయి దేవి మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాల బాలికలకు మానసికంగా, ఆలోచనా పరంగా మార్పులు చోటుచేసుకుంటాయని, ప్రమాదకర పరిస్థితుల నుండి దూరం చేసి వారిని సన్మార్గంలోకి తీసుకువచ్చేందుకు తల్లిదండ్రులను చైతన్యపర్చాలని తెలిపారు. వేసవి సెలవుల్లో అవగాన కార్యక్రమాలు నిర్వహించి కిషోర బాలబాలికలకు దిశా నిర్దేశం చేయాలన్నారు. 13 నుంచి 19ఏళ్ల కిశోర బాలబాలికలకు ఆరోగ్య సమస్యలను ముందుగా గుర్తించి తగిన సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. యునిసెఫ్ కన్సల్టెంట్ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ కౌమార దశలో ఉన్న బాల బాలికల నడవడికపై తల్లిదండ్రులకు అభద్రతా భావం ఉండకూడదని అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో బాల బాలికల పై డిజిటల్ మాధ్యమాలు ప్రభావితం చేస్తున్నాయని అన్నారు. కౌమార దశలో ఉన్న బాల బాలికలు తో తల్లిదండ్రులు కూర్చుని వారితో చర్చించి వారి అవసరాలు తీర్చాలని చెప్పారు. సఖి, యువ గ్రూప్‌ల పరిధిలో కిశోర బాలల తల్లిదండ్రులకు పోక్సో చట్టం,బాల్యవివాహాలు నిరోధం, టీనేజ్ ప్రెగ్నెన్సీ నిరోధం, సైబర్ క్రైమ్ పై అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో విజయనగరం ప్రాజెక్ట్ డైరెక్టర్ రుక్సానా సుల్తానా, మన్యం ప్రాజెక్ట్ డైరెక్టర్ కనక దుర్గ, రిసోర్స్ పర్సన్ నాగమణి, మన్యం జిల్లా నోడల్ ఆఫీసర్ టి.జగన్, మూడు జిల్లాల సిడిపిఒలు, డిసిపిఒలు పాల్గొన్నారు.



సదస్సును ప్రారంభిస్తున్న ఆర్‌జెడి చిన్మయిదేవి

విక్రంపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని విక్రంపురం గ్రామంలో గురువారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, జ్వర పీడితులు, మధుమేహ, రక్తపోటు, తదితర వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు, పాల్గొన్నారు.

సబ్సిడీ యంత్రాల తనిఖీ

ప్రజాశక్తి - మక్కువ

మండలానికి వ్యవసాయ యాంత్రీకరణలో సబ్సిడీ మీద అందచేసిన వరి నూర్పిడి యంత్రాలను వ్యవసాయ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి వచ్చిన సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్‌వి రమేష్, వ్యవసాయ అధికారి శివరామకృష్ణ గురువారం తనిఖీ చేశారు. కొయ్యనపేట, కాశీపట్నం, కోన గ్రామాలల వరి నూర్పిడి యంత్రాలను తనిఖీ చేశారు. వ్యవసాయ శాఖ రాయితీ పై ఇస్తున్న పరికరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బొత్స శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకులు పవన్, దివ్య, రాంకుమార్ పాల్గొన్నారు.

తోటపల్లిలో ధ్యాన కేంద్రం

ప్రజాశక్తి- గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లి వద్ద ధ్యాన కేంద్రాన్ని విశ్రాంత ఐఎఎస్ అధికారి, శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్నెస్ ట్రైనర్ జె.మురళీ గురువారం ప్రారంభించారు. వ్యక్తి రుగ్మతలకు కారణం మానసిక ప్రశాంతత లేకపోవటమేనని అన్నారు. గ్రామంలో ధ్యాన కేంద్రం ప్రారంభించిన అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ ప్రస్తుత జీవన విధానంలో మానవుడు చాలా రకాల కారణాలతో ప్రతీ చిన్న విషయానికి టెన్షన్ పడిపోతూ కోరి జబ్బులను తెచ్చుకుని అనారోగ్యం పాలు అవుతున్నారన్నారు. ఈ పరిస్థితి మారాలంటే జీవనంలో మార్పులు రావాలని, ధ్యానం నిత్య జీవితంలో భాగం కావాలని హితవు పలికారు. గత నాలుగు రోజులుగా సంతోషపురం, గిజబ, గౌరీపురం, తోటపల్లిలో ధ్యానోత్సవ కార్యక్రమాలు నిర్వహించి, ధ్యానం వల్ల వచ్చు ప్రయోజనాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అప్పల నాయుడు, శ్రీధర్‌నాయుడు, సోమశేఖరరావు తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

ప్రజాశక్తి - సాలూరురూరల్

ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనే ప్రభుత్వ ప్రధాన బాధ్యత అని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని 26 వార్డులో పైలట్ స్కీమ్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ పైలట్ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా తాగునీటి సమస్యలను పరిష్కరించడం, శుద్ధ నీటిని అందుబాటులోకి తెచ్చి మెరుగుపర్చడమే ప్రధాన లక్ష్యంగా తీసుకున్నామన్నారు. ఈ పైలట్ స్కీమ్ విజయవంతమైతే ఇతర వార్డులకు కూడా విస్తరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

9న మున్సిపల్ షాపులకు వేలంపాట

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆధీనంలో గల ఐడిఎస్‌ఎంటి షాపింగ్ కాంప్లెక్స్‌లో ఖాళీగా ఉన్న 22, 32, 34, 35, 44, 46, 48 షాపులను అద్దె ప్రాతిపదికన లీజుకు ఇచ్చేందుకు మే 9న ఉదయం 11 గంటలకు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో బహిరంగ వేలం పాట జరుగుతుందని కమిషనర్ సిహెచ్.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ వేలంపాటలో పాల్గొనాలన్నారు. మరిన్ని వివరాల కోసం కార్యాలయం పని దినాల్లో రెవెన్యూ విభాగంలో గల అధికారులను సంప్రదించాలన్నారు. వేలంపాటలో పాల్గొనే వారు షాపుల కేటగిరి వారీగా రెండేసి చొప్పున సాల్విన్స్‌లను వేలంపాటకు మూడు రోజులు ముందు తీసుకొని మున్సిపల్ రెవెన్యూ విభాగంలో ఇచ్చి వేలం పాటలో పాల్గొనాలని కమిషనర్ కోరారు.

సర్పంచ్, ఎంపిటిసిలకు సన్మానం

ప్రజాశక్తి- సాలూరు రూరల్

ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దిన సర్పంచ్, ఎంపిటిసిలను విజయనగరం జిల్లా కేంద్రంలో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు గురువారం సన్మానించారు. మండలంలోని కరాసవలస గ్రామ పంచాయతీని ఆదర్శ పంచాయతీగా తయారు చేసిన సర్పంచ్ ఒంటి లక్ష్మి, ఎంపిటిసి అప్పికొండ రమాదేవిలను జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సన్మానించారు.

ఓవైపు రోడ్డు నిర్మాణం..
మరోవైపు పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - మక్కువ



ప్రమాదకరంగా ఉన్న స్తంభం

మక్కువ - చినబోగిలి రహదారి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. దాదాపు 16 కిలోమీటర్ల రహదారి సుమారు రూ.37 కోట్ల పైబడి నిధులతో నిర్మాణ కంపెనీ పనులు ప్రారంభించింది. అయితే మక్కువ నుంచి పాపయ్యవలస మధ్య రహదారికి ఆనుకుని ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించకపోవడంతో ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి రహదారి నిర్మాణం చేసి ఉంటే బాగుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, కాంట్రాక్టర్ స్పందించి విద్యుత్ లైన్‌ను పక్కకు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ పరిధిలోని పలుచోట్ల చలివేంద్రాలను నగర పంచాయతీ కమిషనర్ ఎస్‌జెవి రత్నం రాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల దాహార్తి తీర్చేందుకు ఈ చలివేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు వీటిని వినియోగించుకోవాలని కోరారు. సంత మార్కెట్, శ్రీ కోట దుర్గ దేవస్థానం, ఆర్‌టిసి కాంప్లెక్స్ దగ్గర చలివేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో మేనేజర్ టి.జయరాం, ఇన్‌ఛార్జి అసిస్టెంట్ ఇంజినీర్ దేవి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

20 లీటర్ల నాటు సారా స్వాధీనం

ప్రజాశక్తి - కురుపాం

ప్రభుత్వ ఆదేశాల మేరకు నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన కురుపాంలో గురువారం ఎక్సైజ్ సిబ్బంది నాటు సారా నమ్మకాలపై దాడులు జరిపారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ కురుపాం గ్రామానికి చెందిన రాయపిల్లి ప్రవీణ్ కుమార్ సారా అమ్ముతుండగా 20 లీటర్ల నాటుసారాను స్వాధీన పర్చుకొని రిమాండ్‌కు తరలించామని తెలిపారు. అదే గ్రామానికి చెందిన రాయిపిల్లి అప్పారావు సారా సరఫరా చేస్తున్నాడని సమాచారం ఉందని, ఆ వ్యక్తిని కూడా అరెస్టు చేస్తామని తెలిపారు. అలాగే సారా తయారు చేసినా, అమ్మినా అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ జె.రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం

ప్రజాశక్తి - కురుపాం

జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవాన్ని కురుపాం మేజర్ పంచాయతీ సచివాలయం వద్ద గురువారం ఇఒపిఆర్‌డి వై.వెంకటనాయుడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలో అన్ని పంచాయతీల్లో పంచాయతీరాజ్ దినోత్సవాలు సచివాలయాల వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి వెంకటనాయుడు పంచాయతీరాజ్ దినోత్సవం ప్రాముఖ్యత గూర్చి సిబ్బందికి వివరించారు. అనంతరం సచివాలయ ఆవరణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జి.సుజత, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ ఎస్.కార్తీక్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కురుపాం: మొక్కలు నాటుతున్న అధికారులు

వీరఘట్టం: స్థానిక మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం పంచాయతీరాజ్ దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ బి.వెంకటరమణ మాట్లాడుతూ పంచాయతీరాజ్‌ను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒ బి.కోటేశ్వరరావు, ఇఒపిఆర్‌డి టి.వెంకటరమణమూర్తి, గ్రామ పెద్దలు జామి లక్ష్మీనారాయణ, బళ్ల హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరం: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్, గాంధీజి ఫోటోలకు పూలు మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ త్రివిక్రమరావు మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థ ప్రజలకు అవగాహన ఉండాలన్నారు. అనంతరం వివిధ గ్రామపంచాయతీ కార్యదర్శులకు, సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి ఎం.బాబ్జి, ఎంపిపి భర్త శ్రీరాములునాయుడు, ఇఒపిఒఆర్‌డి కేకే కుమార్ వర్మ, ఎంఇఒ జి సూర్యదేముడు, ఎంఎల్‌ఎస్ ప్రసాద్‌తో పాటు ఎంపిటిసిలు, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మహాత్మా గాంధీ స్ఫూర్తితో పల్లెలను బలోపేతం చేసి గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు అందరూ కలిసి రావాలని ఇన్చార్జి ఎంపిడిఒ జి.రమణమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీరాజ్ దినోత్సవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మండలంలోని 20 సచివాలయాల్లోనూ ఈ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు.



పార్వతీపురం: అంబేద్కర్, గాంధీ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఇరిడి గ్రామంలో వన్‌ధన్ వికాస కేంద్రం ద్వారా జీడిపిక్కల కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన జీడి పిక్కలు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోని దళారుల బారినపడి మోసపోవద్దని చెప్పారు. స్వయంగా వీడీవీకే సభ్యులు ద్వారా జీడిపిక్కలు కొనుగోలు చేస్తారని దీని మద్దతు ధర కేజీ రూ.157 అని తెలిపారు. ఈ అవకాశాన్ని జీడీ రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వన్‌ధన్ వికాస కేంద్రం ద్వారా లక్ష రూపాయలు విలువ చేసే టెంట్ హౌస్ సామాగ్రిని మహిళా సంఘ సభ్యులకు పంపిణి చేశారు. అనంతరం ఆమెను గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం రామకృష్ణ, జనసేన సమన్వయకర్త, ఇరిడి ఎంపిటిసి కద్రక మల్లేశ్వరరావు, వీడీవీకే సభ్యులు ఊర్వసి, నియోజకవర్గ ఎస్‌టి సెల్ ప్రధాన కార్యదర్శి అడ్డాకుల నరేష్, నాయకులు వెంకట్రావు, కొండలరావు, బుజ్జేశ్వరరావు, చిన్న, లక్ష్మణరావు, అప్పలస్వామి, సిసిలు, విఒఎలు, వీడీవీకే సభ్యులు, సచివాలయ సిబ్బంది, మహిళా సంఘ సభ్యులు, జీడి రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పార్వతీపురంరూరల్ : గిరిజనులు తమ ఉత్పత్తులను మార్కెటింగ్ చేసుకోవడానికి వన్ ధన్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర కోరారు. మండలంలోని డోకిశీలలో ఐటిడిఎ ఏర్పాటు చేసిన వన్ దన్ కేంద్రంలో జీడిపిక్కల కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళారీల బారిన పడకుండా గిరిజనులు జీడిపిక్కలను కొనుగోలు కేంద్రాలకు తరలించి తమ ఉత్పత్తులను అమ్ముకోవాల్సిందిగా కోరారు. ఈ ఏడాది జీడిపిక్కలు కేజీ రూ.155 చొప్పున ధర నిర్ణయించడమైందని, వెలుగు సిబ్బంది ద్వారా కొనుగోలు చేయనున్నట్టు తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు చీపుర్లు, తేనె, జీడిపిక్కలు, ఇతర ఉత్పత్తులను తరలించి తక్షణమే నగదును పొందాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ సుధారాణి, ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి భూషణ్, సన్నీ బాబు, ఇన్చార్జి ఎంపిడిఒ జి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం..
ప్రకృతి వ్యవసాయానికి మార్గదర్శకం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం మండలం ప్రకృతి వ్యవసాయానికి మార్గదర్శకంగా మారుతుందని ఎఒ సిహెచ్.ప్రసాదరావు అన్నారు. ఐకెపి కార్యాలయంలో గురువారం ప్రకృతి వ్యవసాయంపై మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం విస్తరించడానికి ప్రతి శాఖ కలిసి పనిచేయాలన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించాలని తద్వారా ప్రోత్సహించాలని అన్నారు. రైతు సంక్షేమ కోసం ప్రకృతి దిశగా ముందుకు అడుగేస్తున్న ప్రతి ప్రయోగం భవిష్యత్తు తరాల కోసం ఆరోగ్యకరమైన భూమి ఆహారం అందించడంలో కీలకంగా నిలుస్తుందని వివరించారు. ఈ సమావేశంలో ఎపిఎం రామకృష్ణ, సిసి, విఎఎ, ఒబి, విఒఎ ఎపిసిఎన్‌ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

మనస్థాపంతో కలుపు మందు తాగి ఆత్మహత్యానికి ఒక వ్యక్తి పాల్పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానిక జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలాన్నాయి. వైకెఎం కాలనీకి చెందిన వెలగాల శ్రీనివాసరెడ్డి అప్పులు చేసి ఎప్పటికప్పుడు తాగుతుండడంతో భార్య సావిత్రి మందలిస్తూ ఉండేది. బుధవారం రాత్రి కూడా తాగి రావడంతో మందలించింది. దీనితో మనస్తాపం చెంది గురువారం తెల్లవారు జామున కలుపు మందు తాగి ఆత్మహత్యానికి పాల్పడ్డాడు. కొత్తసమయం తరువాత వాంతులు చేసుకోవడంతో పురుగుల మందు వాసన రావడంతో భార్య సావిత్రి గమనించి 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకొని రాగా వైద్యులు చికిత్స అందించారు. ప్రాథమిక చికిత్స తీసుకొని స్థానిక కర్షక మహర్షి ఆసుపత్రికి తీసుకొని వెళ్లిపోయారు. జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు ఎఎస్‌ఐ నిమ్మకాయల భాస్కరరావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

మేడేను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - కొమరాడ

మేడే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో మేడే కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం సాంబమూర్తి, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘ నాయకులు గౌరీశంకర్రావు, వెంకటరమణ, గంగరాజు విలేకరులతో మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు కల్పించకుండా దుర్మార్గంగా వ్యవహరిస్తుందన్నారు. కార్మిక సమస్యల పరిష్కారానికి సంఘాలు పెట్టి ఉద్యమించేందుకు రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులను కూడా కేంద్ర ప్రభుత్వం హరిస్తుందని, అందులో భాగంగా 48 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందని ఇది చాలా అన్యాయమని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాల్సి ఉన్నప్పటికీ గత ఐదేళ్లుగా దేశవ్యాప్తంగా కార్మికులకు జీతభత్యాలు పెరుగుదల లేదని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో సంపద కార్పొరేట్లు చేతుల్లోకి చేరుతున్న నేపథ్యంలో సామాన్యుల కొనుగోలు శక్తి దారుణంగా పడిపోయిందన్నారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు అనుకూలంగా మార్చి పూర్తిగా నాశనం చేయడం వల్ల సామాన్యులకు నిత్యావసర సరుకులు కూడా అందుబాటులోకి లేకుండా పోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, కావున అన్ని కార్మిక సంఘాల కార్మికులు, కర్షకులు ఐక్యంగా మేడేను కార్యక్రమం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండలంలో గల అన్ని పంచాయతీలకు సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు, కార్మికులు

పార్వతీపురం: ప్రపంచ పీడిత ప్రజల దీక్షా దినం మేడేని జిల్లా అంతటా విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.గోపాలం కోరారు. గురువారం స్థానిక కలాసీ వర్తక సంఘం భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వర్తక కళాసీ సంఘం అధ్యక్షులు గేదెల సర్వేశ్వరరావు అధ్యక్షత వహించగా గోపాలం మాట్లాడారు. గ్లోబల్ శ్రమదోపిడి అరికట్టాలని, స్కీమ్ వర్కర్సను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేలు రూపాలుగా నిర్ణయించాలన్న డిమాండ్లతో మేడే జరపాలని పిలుపు నిచ్చారు. అనంతరం మేడే పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో వర్తక కళాసీ సంఘం ఉపాధ్యక్షులు యస్.చిన్నారావు, పిఒడబ్ల్యూ నాయకులు రమణి, అరుణోదయ నాయకులు యస్.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అందని ఆధార్ సేవలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక గ్రామ సచివాలయంలోని ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం మూతపడి దాదాపు నెలలు పైబడుతున్నప్పటికీ పట్టించుకునే నాధుడు కరువయ్యాడు. దీంతో ఆధార్ సేవలు నిమిత్తం ఈప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించిన దాఖలాల్లేవని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూతపడిన ఆధార్ కేంద్రాన్ని తెరిచి సేవలందించుదామన్న కనీస బాధ్యతను విస్మరించారని పలువురు విమర్శిస్తున్నారు. గరుగుబిల్లి సచివాలయంలో ఆధార్ కేంద్రంలో ప్రజలకు సేవలు అందుతున్నాయా లేదా అన్న విషయం ఆన్‌లైన్‌లో తెలుస్తుంది. అయినప్పటికీ దాదాపు ఏడాది పైబడుతున్నా ఆధార్ కేంద్రం ద్వారా సేవలందుతున్నాయా లేదా అన్న విషయం ఉన్నతాధికారులు పరిశీలించకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు అంటున్నారు. ఏళ్ల తరబడి ఆధార్ కేంద్రం పని చేయ నప్పటికి పట్టించు కోకుండా ఇలా గేనా ప్రజలకు సేవలు అందిస్తారా అని ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం గరుగుబిల్లి, పెద్దూరు, రావుపల్లి, గొట్టివలస తదితర ప్రాంతాలకు చెందిన వారు ఆధార్ సేవలు నిమిత్తం ఉల్లిభద్ర, రావివలస, గ్రామ సచియాలకు వెళు _న్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకొని మండల కేంద్రంలో ఆధార్ సేవలు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.




మూతబడిన ఆధార్ కేంద్రం

30 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేయండి

ప్రజాశక్తి - వీరఘట్టం

వీరఘట్టం ఆరు పడకల ఆసుపత్రిని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయాలని గురువారం స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను తన నివాసంలో వైద్య సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. వంగర, గరుగుబిల్లి, సీతంపేట తదితర మండలాల నుండి రోగులు అధిక సంఖ్యలో వీరఘట్టం ఆసుపత్రికి వచ్చి వైద్యం పొందుతున్నారని, ఈ కారణంగా ఆసుపత్రిలో మందులు కొరతతో పాటు ఆసుపత్రి ఇరుకుగా ఉన్నందున వచ్చే రోగులు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని, ఎమ్మెల్యే చొరవ తీసుకుని 30పడకల ఆసుపత్రిగా అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్, సూపర్‌వైజర్లు జనార్దన్ రావు, శాంతకుమారి, సింహాచలం ఉన్నారు.



ఎమ్మెల్యేకు వినతినిస్తున్న వైద్య సిబ్బంది

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

పాలకొండ : తమ సమస్యలు పరిష్కరించాలని సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్లు గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణను కలిసి వినతి పత్రం అందించారు. తమ ప్రమోషను ప్రక్రియతో పాటు పలు సమస్యలను పే స్కేల్‌కు సంబంధించి అంశాలను ఎమ్మెల్యేకు వివరించారు. వీటికి ఎమ్మెల్యే స్పందిస్తూ సిఎం దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

అర్తాం విద్యార్థికి ఎమ్మెల్యే అభినందనలు

మండలంలోని అర్తాం గ్రామానికి చెందిన పొగిరి వెంకటరమణ కుమారుడు రోహిత్ జెఇఇ మెయిన్స్‌లో 93 ర్యాంకు సంపాదించడంతో స్థానిక ఎమ్మెల్యే జయకృష్ణ గురువారం ఆ విద్యార్థిని అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, ఎంపిపి ప్రతినిధి సుధాకర్, వైస్ ఎంపిపి వాకముడి అనిల్, వీరఘట్టం మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, మాచర్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో పౌర సేవలు శూన్యం

◆ కానరాని సిబ్బంది ◆అవస్థలు పడుతున్న ప్రజలు ◆చోద్యం చూస్తున్న అధికారులు

ప్రజాశక్తి- సీతానగరం

మండలంలోని పెదబోగిల మేజర్ పంచాయతీ, మధుర గ్రామం బుడ్డిపేటకు చెందిన రౌతు సాయికుమార్, మీసాల జగన్నాథంలు తమకు కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువపత్రాలు, అవసరం పడి గత మూడు రోజులుగా సచివాలయాలు చుట్టూ తిరుగుతున్నా ఫలితం దక్కలేదు. పోనీ మీ సేవలో రిజిస్ట్రేషన్ చేసుకుందామంటే మీ సేవా సర్వర్ పనిచేయడం లేదు. గత మూడు రోజులుగా సచివాలయం చుట్టూ తిరుగుతున్నా డిజిటల్ అసిస్టెంట్లు రెండు సచివాలయాల్లోనూ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం ప్రజల వద్దకే పాలన అందించాలని సదుద్దేశంతో ప్రజలకు అన్ని శాఖలను ఒకే దగ్గరకు అందుబాటులోకి తీసుకురావాలని, ఈ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. కానీ నేడు అందుకు వ్యతిరేకంగా సచివాలయాలు నడుస్తున్నాయి. రైతు సేవలైన 1బి, యఫ్‌ఎంబి, అడంగల్ కాపీ, సచివాలయంలో పొందాలంటే కష్టతరమవుతోంది. పోనీ మీ సేవలో కడదామంటే అక్కడ వెబ్ సైట్ నిలుపుదల చేయడం వల్ల పై సేవలు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నారు. పదివేల మంది జనాభా కలిగిన పెదబోగిల మేజర్ పంచాయతీలో రెండు సచివాలయాలుండగా సచివాల యం1లో డిజిటల్ అసిస్టెంట్ పోస్ట్ ఖాళీగా వుంది. సచివాలయం 2లో ఉన్న డిజిటల్ అసిస్టెంట్ సెలవుపై వున్నారు. ఇందుకు ప్రత్యామ్నాయంగా ఆలోచించాల్సిన సంబం ధిత అధికారులు చోద్యం చూస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ప్రత్య మ్నాయం ఆలోచించి ప్రజల సమస్యకు తక్షణమే పరిష్కారం చూపించాలని కోరుతున్నారు.



సచివాలయం వద్ద వేచి ఉన్న బాధితులు



వీరఘట్టం: కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే, కూటమి నాయకులు

ఉగ్రదాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జమ్మూ- కాశ్మీర్‌లో ఉగ్ర దాడిని ఖండిస్తూ మృతులకు సంతాపంగా గుమ్మలక్ష్మీపురంలో గురువారం సాయంత్రం కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి పాల్గొన్నారు. దాడి చేసిన ముష్కర్లపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రశాంతంగా ఉన్న కాశ్మీర్లో టూరిస్టులపై ఉగ్ర వాదులు విచక్షణారహితంగా దాడి చేసి కాల్పులు జరపడం అమానుషం అన్నారు. మృతి చెందిన పర్యాటకులకు సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుపాం ఎఎంసి చైర్మన్ కె.కళావతి, మండల టిడిపి కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, కూటమి నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

వీరఘట్టం: మండల కేంద్రంలో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కూటమి నాయకులు పాల్గొన్నారు.

కురుపాం: గాంధీనగర్ కూడలిలో అంబేద్కర్, ఎన్‌టిఆర్ విగ్రహాల వద్ద యువత కొవ్వొత్తుల ర్యాలీ చేశారు.

సీతానగరం: పహల్గాం ఉగ్ర దాడికి నిరసనగా మండలంలో చెల్లమనాయుడువలసలో టిడిపి నాయకులు గ్రామ పెద్ద పారినాయుడు ఆధ్వర్యంలో స్థానికులతో కలిసి కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ అమాయకులైన పౌరులు, పర్యాటకులను ఉగ్రవాదులు కాల్చి చంపడం అనాగరిక, అమానవీయ చర్య అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సుబ్బారావు సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక సబ్ పోస్టు ఆఫీసు పరిధిలో 32 ఏళ్లు ఏకధాటిగా గ్రామీణ డాక్ సేవక్ గా, డెలివరీ ఏజెంట్‌గా, మెయిల్ బ్యాగ్ తీసుకుని వచ్చి తీసుకుని వెళ్లే వ్యక్తిగా కాశీసుబ్బారావు అందించిన సేవలు ఎంతో అభినందనీయమని పార్వతీపురం పోస్టల్ శాఖ ఏఎస్పీ మురళి కొనియాడారు. గురువారం స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఇటీవల పదవీ విరమణ చేసిన గ్రామీణ డాక్ సేవక్ కాశీ సుబ్బారావు నాగమణి దంపతులను పోస్టల్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, సీతానగరం గ్రామపెద్దలు, యూనియన్ నాయకులు, కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పార్వతీపురం పోస్టల్ శాఖ ఏఎస్పీ మురళి, బొబ్బిలి సబ్ డివిజన్ ఐపిఒ శ్రీనివాసరావు సుబ్బారావు సేవలను కొనియాడారు. పోస్టల్ శాఖలో చిరుద్యోగిగా పనిచేసిన సుబ్బారావు అందరిచేత మంచివ్యక్తిగా పిలవబడటం ఎంతో గర్వకారణమన్నారు. కార్యక్రమంలో సీతానగరం సబ్‌పోస్ట్ ఎస్‌పిఎం చిన్ని, స్వామి నాయుడు, యూనియన్ నాయకులు వేణు, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు, ఇడిఎంసిలు, రిటైర్డ్ బిపిఎంలతో పాటు వివిధ శాఖల అధికారులు డాక్టరు దీనకుమార్, ప్రసాద్, సూరిదేముడు, కుమార్ వర్మ, సీతానగరం మండల కేంద్రానికి చెందిన ప్రముఖులు సాలా హరిగోపాలరావు, అరవింద్, మమ్ముల విశ్వేశ్వరరావు, అరిశెట్టి సత్యానా రాయణ, కూర్మదాసు శ్రీనివాసరావు, ఈర్ల సూర్యనారాయణ, పాల్గొన్నారు.

కొట్లాటలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

కొట్లాటలో వ్యక్తికి గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానిక జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక మునిసిపల్ కొత్తవలసకు చెందిన సాలాపు ప్రభ ఆటో డ్రైవర్. తన కుమార్తె రజస్వల వేడుకలు ఘనంగా చేయాలని భార్య శిరీష కుమార్తెను తీసుకొని పుట్టింటికి వెళ్ళిపోయింది. ప్రభ అత్తవారింటికి వెళ్ళి పిలవగా బావమరిది పొట్నూరు వాసు, అత్త చిన్నమ్మ, భార్య శిరీష దాడి చేసి రాయితో కొట్టారు. దీనితో ప్రభకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన ప్రభ స్నేహితుడు తులసి పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తీసుకొని రాగా వైద్యులు చికిత్స అందించారు. జిల్లా ఆసుపత్రి ఔట్ పోస్టు ఎఎస్‌ఐ నిమ్మకాయల భాస్కరరావు వివరాలు నమోదు చేసినట్లు తెలిపారు.